క్లుప్తంగా

బీసీ ఉమెన్స్ వసతిగృహానికి ఫ్యాన్లు



ఫ్యాన్లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ ఉమెన్స్ వసతిగృహానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా 20 ఫ్యాన్లను శనివారం అందజేశారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి కొనుగోలు చేసిన ఫ్యాన్లను వసతిగృహ సిబ్బందికి తన కార్యలయంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రిలో చేర్చాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: రోగులను సకాలంలో ఆస్పత్రిలో చేర్చాలని ఆన్‌జాబ్ ట్రైనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక 108 కార్యాలయంలో ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ, 108 అంబులెన్సులో రోగిని ఎక్కించిన వెంటనే అవసరమైన చికిత్స అందించాలన్నారు. ఆధునిక పద్ధతిలో గుండె జబ్బులను ముందుగా గుర్తించడం, ప్రసవ సమయంలో సంసిద్ధం కావడం, నవజాత శిశు రక్షణపై అవగాహన కల్పించారు. సమావేశంలో 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అవనాపు షణ్ముఖ్, రవికుమార్, ఉపేంద్ర పాల్గొన్నారు.

విద్యతో మెరుగైన సమాజ నిర్మాణం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: సమాజ నిర్మాణానికి పటిష్టమైన పునాది విద్యేనని మేమున్నాం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కె.సత్యన్నారాయణ అన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని హిందూ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది చిన్నారులకు తెలుగు, ఆంగ్లం కాపీ రైటింగ్ పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థులకు చేయూత నివ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో లత, జమున, దర్శిత్, మంజుల, సురేష్, చంద్రశేఖర్, మూర్తి, లలితకుమారి, కె.అవతారం, బీఎం.సంధ్యారాణి, బి.భారతి, పి.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో నిమగ్నం కావాలి

నెల్లిమర్ల రూరల్: ఉన్నత భవిష్యత్ కోసం విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించాలని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు..

సెంచూరియన్ వర్సిటీ ఆధ్వర్యంలో టెక్కలిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామినాయుడు, ఆప్టోమెట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆలన తేజ పాల్గొన్నారు.

పతకాలు సాధించడం గొప్ప విషయం

విజయనగరం టౌన్: అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పతకాలు తీసుకురావడం ఎంతో సంతృప్తినిచ్చిందని మున్నా మైఖేల్ డ్యాన్స్ అకాడమీ నిర్వహకుడు మున్నా అన్నారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, శ్రీలంకలో ఈ నెల 18 నుంచి రెండురోజుల పాటు రాజపక్సే థియేటర్‌లో నిర్వహించిన ఐఐజీఎఫ్ 2023 అంతర్జాతీయ స్థాయి పాశ్చాత్య నృత్య పోటీల్లో అకాడమీ విద్యార్థులు వంశిక సింగ్, దర్శన్ సురానా, ప్రదీప్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా పలు అకాడమీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కార్తీక సమారాధన కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 5న 'కార్తీక వన సమారాధన' నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ చైర్మన్ కుమ్మరిగుంట శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ, చాకలిపేటలో గల ఎస్‌సీఎస్.గార్డెన్‌లో వన సమారాధన నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, రాంజీ, కొత్త నరసింహం, రామారావు, పెంటపాటి శ్రీనివాసరావు, వజ్రపు కష్టారావు, గూడూరు నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సామాజిక భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజల అవసరాలకు అనుగుణంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 1వ డివిజన్ నందిగుడ్డి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది లక్షల రూపాయలతో నిర్మించిన సామాజిక భవనం స్థానికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్న ఘనత కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కోరగా... కోలగట్ల స్పందించి రూ. పది లక్షలు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా కోలగట్లను గెలిపించుకుంటే, నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, తమ డివిజన్ గతం కంటే ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ముచ్చు శ్రీనివాసరావు, ముద్దాడ మధు, డివిజన్ ఇన్‌చార్జ్ దాసు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీలు అనేవి ముఖ్యమైనవని, వాటిని సక్రమంగా చేపట్టాల్సిన అవసరముందని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకం చట్టం దేశంలోనే గొప్పదని తెలిపారు. పథకంలో అవినీతి, అక్రమాలు వెలుగు తీయడానికి సామాజిక తనిఖీలు అవసరమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, సామాజిక తనిఖీల ఎస్‌ఆర్‌పీ ఎస్.మాధవరావు, ఏపీఓ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా సేవలందించాలి..

గ్రామ సచివాలయ ఉద్యోగులు సచివాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సక్రమంగా సేవలందించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు తెలిపారు. విజయనగరం మండలంలోని జొన్నవలస గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికే ఆదర్శంగా నిలిచిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు గ్రామాల్లోనే 540కి పైగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి..



భోగాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ ఉప్పాడ, వెలుగు మహిళ సమాఖ్య సభ్యులు

భోగాపురం: బాల్య వివాహాలను అరికట్టానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, వెలుగు ఏపీఎం రమణ కోరారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి మండల మహిళ సమాఖ్య సభ్యులతో కలిసి శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల సత్యవతి, ఉప్పాడ శివారెడ్డి, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష నిర్మూలించాలి..

డెంకాడ: జెండర్ ఆధారిత వివక్ష నిర్మూలనకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయలక్ష్మి, డెంకాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ రామమూర్తి కోరారు. వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 22 వరకు జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంస్థ ప్రతినిధులు శివశంకర్, వైఎస్సార్ క్రాంతిపథం సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల జయంతికి ఏర్పాట్లు పూర్తి



ఘంటసాల జయంతి ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: అమర గాయకుడు ఘంటసాల 101వ జయంతి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసామని ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు అన్నారు. ఈ మేరకు కళాపీఠం ఆవరణలో ఉత్సవాల ఆహ్వానపత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ ఒకటో తేదీన ఆనందగజపతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు 12 గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నిర్వహించే సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరై ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్‌ను ఘనంగా సత్కరిస్తారన్నారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి విష్ణుమూర్తి, ధవళ సర్వేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకా కాశీవిశ్వేశ్వరుడు, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ, ఎస్.సుభ, ఎం.మమత, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

నెల్లిమర్ల: జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వి. శ్రీనివాస్ సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా నగర పంచాయతీ పరిధి పంప్‌హౌస్ వద్దనున్న జగనన్న కాలనీని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 77 ఇళ్లకు గాను 57 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు రెండు వారాల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ జి. మురళీమోహన్, ఏఈ ఆర్.పవన్, వార్డు ఏమినిటీస్ కార్యదర్శి అలేఖ్య, అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



చింతపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తీరప్రాంతమైన చింతపల్లి-1 సచివాలయం పరిధిలో రెండో రోజైన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ప్రజలు రహదారులు, డ్రైనేజీలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా.. మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా సంక్షేమ లబ్ధిని నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని తెలిపారు. చింతపల్లిలో జెట్టీ, బీచ్ రిసార్ట్స్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం జిల్లాలోనే ప్రధాన పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రాబోయే 2024 ఎన్నికలలో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, సర్పంచ్ బర్రి ముసలి, ప్రజాప్రతినిధులు గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, అయ్యప్ప, గాంధీ, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఏపీఓ రత్నమాల, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మంటప నిర్మాణానికి అనుమతులు...

మండలంలో కుమిలి గ్రామంలో మహాకాళి గణపతి దేవస్థానం స్థలంలో కల్యాణ మంటప నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు దేవస్థానం కమిటీ చైర్మన్ ఎస్. రాజారెడ్డికి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలోని సర్వే నంబర్ 244లో 1.10 ఎకరాల స్థలంలో ఎస్‌ఎంఎస్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో (కోటీ 50 లక్షల రూపాయలతో) కల్యాణ మంటపం నిర్మించనున్నట్లు చెప్పారు. దేవదాయశాఖ అనుమతుల కోసం కృషి చేసిన ఎమ్మెల్యేకు కుమిలి వైస్ సర్పంచ్ సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, నీలాపు రాజారెడ్డి, పడాల శ్రీధర్, తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం, పెద బూరాడపేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర శనివారం నిర్వహించారు. ప్రత్యేక రథం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి భాస్కరరావు, ఎంపీడీఓ రామారావు, తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబేరేయగుళ్లులో వైభవంగా విష్ణు పారాయణం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబేరేయగుళ్లలో ఉన్న అతి పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సింహాచలానికి చెందిన భగవద్రామానుజ బృందం ఆధ్వర్యంలో విష్ణు పారాయణం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. విష్ణు పురాణంలో ఉన్న ప్రహ్లాద చరిత్ర పారాయణాన్ని స్వామి సన్నిధిలో నిర్వహించారు. లోక కల్యాణార్థం పారాయణాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాజగోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ మధు, ప్రిన్సిపాల్ రోయినాఖాన్

విజయనగరం అర్బన్: రూరల్ స్కేటింగ్ ఫెడరేషన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 14వ తేదీ నుంచి 18 వరకు చెన్నైలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఫోర్ట్‌సిటీ స్కూల్ విద్యార్థులు నిత్యప్రియ, కౌశిక్‌లు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల చైర్మన్ కేపీపీ రాజు, వైస్ చైర్మన్ చంటి, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, ప్రిన్సిపాల్ రోయినాఖాన్, తదితరులు శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్
- వేడుకగా సత్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు



శశిభూషణరావును సత్కరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, కళాశాల బృందం

విజయనగరం టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని చేరుకోవాలని అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ సూచించారు. శనివారం స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఉన్నత భావాలు అలవర్చుకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి, కెరీర్‌పైన దృష్టి సారించాలని సూచించారు. మొబైల్స్‌కు వీలైనంతవరకు దూరంగా ఉంటూ, ఇష్టంతో చదవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక లక్ష్యం మేరకు చదవాలన్నారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ.రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదివి జ్ఞానవంతులుగాను, విలువలతో కూడిన విద్యనేర్చుకుని తేజోవంతులుగా తయారుకావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి విద్యార్థులు ఏ విధంగా కెరీర్‌ను డెవలప్ చేసుకోవాలో వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఉర్రూతలూగించాయి. అలాగే జేఎన్‌టీయూ విజయనగరానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ ఎం.శశిభూషణరావును అతిథులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

కాళికాదేవి బోనాల మహోత్సవంలో కోలగట్ల



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను ఆశీర్వదిస్తున్న పండితులు

విజయనగరం: నగరంలోని దాసన్నపేట ప్రాంతంలో కొలువైన కాళికాదేవి బోనాల మహోత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం పాల్గొన్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఆయనకు ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికింది. కాళికాదేవి గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు కోలగట్లకు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు శ్రీను మాట్లాడుతూ, మహిమాన్వితమైన కాళికాదేవి బోనాల మహోత్సవాలను ఈ నెల 23 నుంచి 27 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 27న మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో 26 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని కూడా నెలకొల్పనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పొంతపల్లి గోపి, బోడసింగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం



ఎంఆర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

విజయనగరం అర్బన్: మహారాజా అటానమస్ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ 2(ఏ) గర్ల్స్ బెటాలియన్ సమక్షంలో 'పునీత్ సాగర్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల నుంచి పెద్ద చెరువు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ చెత్తా,చెదారాలు తొలగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, ఎన్‌సీసీ కేర్ టేకర్ బీ.రుూన్సీ, 2 (ఏ) ఆంధ్రా బెటాలియన్ సిబ్బంది సి.హుస్సేనయ్య, 20 మంది మహిళా క్యాడెట్లు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మండలంలోని సముద్రతీర పంచాయతీ గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని... నందిగాం, ముంజేరు, తదితర గ్రామాలకు నిత్యం విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఏఈ ఫేక్ మదీనకు సూచించారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు పూర్తయిన గ్రామాలకు వెంటనే తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్ కుమార్‌కు ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇంతవరకు ఇళ్ల నిర్మాణం చేపట్టని వారి స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, వైస్ ఎంపీపీ పడాల సత్యవతి, తహసీల్దార్ చింతా బంగారురాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, పీఆర్ డీఈ బంగారునాయుడు, ఏఓ దాసరి బంగారయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



రామకోనేరు వద్ద స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి మంటపం వద్ద నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ రామకోనేరు వద్దకు తీసుకువెళ్లి విశేష అర్చనలు చేపట్టారు. పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు జరిపించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సీతారామ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జునశర్మ, సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

నేడు జరజాపుపేటలో రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ఈ నెల 26న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక సాధనా యువజన సంఘ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజారావు రైస్ మిల్లు వద్ద నిర్వహించే శిబిరంలో యువకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి.. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుభ, డాక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఈ.దుర్గాదేవి, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: అక్షర బ్రహ్మ, సేవా బ్రహ్మ జాతీయస్థాయి పురస్కారాలు -2023 సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్‌ఎస్.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అధ్యాపకులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు డిసెంబర్ 10వ తేదీలోపు పంపించాలన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


నిబంధనలు పాటించాల్సిందే..



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లోవరాజు

విజయనగరం క్రైమ్: ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని ట్రాఫిక్ ఎస్సై లోవరాజు స్పష్టం చేశారు. పట్టణంలోని అపెక్స్, శ్రీ చైతన్య, సిటీ బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటో నడిపే సమయంలో తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని.. అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


మజ్జిపేటలో అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

విజయనగరం: పట్టణంలోని 36వ డివిజన్‌లో గల వీటీ అగ్రహారం కొత్త మజ్జిపేటలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారుల సందర్శన



రెల్లివీధి ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: వార్షిక ప్రణాళిక నిర్వహణకు సంబంధించి రాష్ట్ర సమగ్రశిక్ష అధికారి డాక్టర్ ఎస్. ప్రసాదరావు, తదితరులు నెల్లిమర్లలోని పలు పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్షిక ప్రణాళికకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే ఎంఆర్‌సీ, స్కూల్ కాంప్లెక్స్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల బడ్జెట్, భవిష్యత్ కార్యచరణకు సంబంధించిన అంశాలను రాష్ట్ర స్థాయి అధికారులను నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఏఎంఓ పి. ప్రసాదరావు, ఏఎస్ఓ ఎస్. సూర్యారావు ఉన్నారు.

సుందరీకరణ పనులకు విఘాతం కలిగిస్తే చర్యలు

విజయనగరం: నగర సుందరీకరణకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యనైనా సహించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నగర అభివృద్ధిలో భాగంగా ఇటీవల కాలంలో అనేక సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అయితే కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ఇష్టారాజ్యంగా డివైడర్లు, ఇతర ప్రైవేట్, ప్రభుత్వ గోడల పైన పోస్టర్లు, కరపత్రాలు అంటించడంతో పాటు నినాదాలు రాస్తున్నారని, ఇది సరికాదని స్పష్టం చేశారు. డిసెంబర్ 1వ తేదీ నాటికి అతికించిన వాల్‌పోస్టర్లు, రాసిన నినాదాలు తొలగించాలన్నారు. లేనిపక్షంలో బాధ్యులకు రూ. పది వేల జరిమాన విధిస్తామని పేర్కొన్నారు.

కారుణ్య నియామకం



వసంతలక్ష్మికి నియామకపత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: మెరకముడిదాం మండలం బుదరాయవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తూ ఎం.మన్మధరావు ఇటీవల మరణించారు. దీంతో ఆయన సతీమణి వసంతలక్ష్మికి మెరకముడిదాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యాలయపు సహాయకురాలిగా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కారుణ్య నియామకపత్రాన్ని శనివారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.